

కథా కౌముది

# హీలియం బెలూన్స్

కాళ్ళకూరి శైలజ

"ఏంటమ్మా. నువ్వూ, డాడీ ఒక గదిలో పడుకుంటున్నారా?"

" అవును చిత్రా "...

"అబ్బో. ఎప్పట్నుంచీ?"

" మంచిదే కదా. ఆశ్చర్యమా? ఇంకేమన్నానా?".

"మమ్మీ. నా ఎయిత్ క్లాస్ నుంచి చూస్తున్నా, నువ్వు – నాన్నా కొట్టుకోడమే. ఎప్పుడూ కామెంట్స్. జడ్జిమెంట్స్. పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్నట్టు ఉండేవారు. మీకిద్దరికీ అదేం ఓపికో అనుకునే వాళ్ళం నేనూ, శీను. ఇక మార్చ్ 2010, నా టెన్త్ ఎగ్జామ్స్, మీ లీగల్ కౌన్సిలింగ్. అబ్బా. ఎప్పటికీ మర్చిపోలేను." చిత్ర మాటల్లో ఏం తప్పు లేదు. అప్పట్లో నీరజ అభిజాత్యం, భర్త అహంకారం నడుమ యుద్ధం నడిచేది.

" ఆ! ", డల్ గా అంది నీరజ. కళ్ళలో నీళ్ళు...

"ఏంటమ్మా ?అన్నయ్య పేరెత్తితే చాలు...ఇలా. రిలాక్స్ . ఇంతకీ నన్నెందుకు ఇండియాకి పిలిచారు? అది చెప్పు ముందు. బెంగగా ఉందా? ఇంకేమైనానా ? "

"చెప్తాలే . కంగారేంటి? నిన్నేగా వచ్చావు? ఇంతకీ శీనూ నీతో ఎలా మాట్లాడేవాడు? పెళ్లయ్యాక నీతో టచ్ లో ఉన్నాడా? ఏమైనా చెప్పేవాడా. ఈ మధ్య ఫోన్ చేసాడా? "

" అమ్మా. మన రిలేషన్షిప్స్ లో ఫ్రెండ్షిప్ తక్కువ. ఎమోషన్స్ తో ముడి. ఏదో సొమ్ములు పోయినట్టు గొడవలు. ఫ్రాం క్ గా ఉండరు. వాడూ అంతే."

"ఓయ్, చిత్రా. మనం కాస్త ప్రశాంతంగా మాట్లాడుకుందాం. అంత నెగెటివ్ గా ఉండకు. అసలే అన్నయ్య మాతో మాట్లాడి ఏడాది కావస్తోంది. నువ్వైనా మా దగ్గర ఉంటే బాగుంటుందని పిలిచాం. ఇండియా వచ్చేయ్ రాదూ? మంచి మాచ్ దొరికితే పెళ్లి చేసుకుందూ గాని. లేదూ మాకు తోడుగా ఉన్నట్టుంటుంది. "

"అమ్మా. ఈ దేశంలో మ్యారేజ్ సిస్టం మీద నాకు మంచి ఒపీనియన్ లేదు. నిక్కచ్చిగా చెప్పాలంటే మిమ్మల్నీ, అన్నయ్యా– వదిన్నీ చూశాక, ఎవ్రీథింగ్ ఈజ్ హోక్స్ అనిపిస్తోంది. నాట్ వర్త్ ఇట్." భుజాలెగరేసి చేతిలో కాఫీ మగ్ టేబుల్ మీద పెట్టి గుండ్రంగా తిప్పుతోంది చిత్ర.

"అంత మాట అనేసేవేమిటే."

చిత్ర వర్జినియా నుంచి వచ్చి రెండు రోజులైంది. సైకాలజీలో పీజీ పూర్తయ్యాక అమెరికా వెళ్లి , జీరియాట్రిక్స్ లో ఫెలోషిప్ చేసి అక్కడే ఒక మెడికల్ సెంటర్లో టెక్నికల్ హెడ్ గా ఉంది.

"నీకు అర్థం కాదమ్మా. ఔను, అన్నయ్య సంగతేంటి ? అసలేం జరిగింది? పోనీ నీకు తెలిసిందేంటి?అంటే, నీ వెర్షన్", అడిగింది చిత్ర.

" పెద్దగా ఏం తెలీదు చిత్రా. వాడేం డిస్కస్ చేయలేదు. యూనివర్సిటీ లవ్ అన్నాడు . మాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. కోవిడ్ సెకండ్ వేవ్ కదా, తక్కువ మందితో జరిగింది. సరే, పెళ్ళి చేసేశాం. 'ఆనంది' పుట్టాక మేం చూసొచ్చాం కూడా. అంతలోనే ఏమైందో. పాపకి ఆర్నెల్లొచ్చాక డివోర్స్ కి వెళ్ళేరు.ఆ రాంగ్ మార్చ్ ఏంటో నాకెప్పటికీ అర్థం కాదు".

" అంటే?"

"ప్రేమంటే లాంగ్ మార్చ్. చాలా దూరం, చాలా కాలం కలిసి నడవడం. వీళ్ళేదో రాంగ్ స్టెప్ వేసారు ", నీరజ గొంతులో బాధ.

"చాలా దిగులుగా ఉంటుంది. మాకు ఏ కబురూ లేదు. ఎక్కడున్నాడో . ఫ్రెండ్స్ నీ, కంపెనీ వాళ్ళనీ అడిగాం. మీ నాన్న ముంబై వెళ్లి చూసి వచ్చారు. ఆర్నెల్ల పాటు మహా మౌనం. నేనూ డేడీ ఒకరితో మరొకరు సరిగా మాట్లాడుకున్నది ఈ క్రైసిస్ వల్లేనేమో.",అంది నీరజ.

కాఫీ తాగడం పూర్తి చేసి, "రెండు నెలల క్రితం వాడి టీం మేట్ ఫోన్ చేసి శ్రీను బావున్నాడు, కానీ, ఎవరితో మాట్లాడేందుకు సుముఖంగా లేడని , డోంట్ వర్రీ అని చెప్పేసాడు. ఫ్రెండ్సెవరూ టచ్ లో లేరట", నిస్తేజంగా చెబుతోంది...

" ఇవాళ్రేపు సోషల్ నెట్వర్కింగ్ లో కనెక్ట్ అవడం ఎంత ఈజీయో, విడిపోడం అంతే ఈజీ. ప్చ్. కనీ పెంచిన వాళ్లకే కనిపించని పిల్లలు".

" మ్...మ్...మ్.నిజమే.స్ట్రేంజ్.ఇంతకీ నువ్వూ డాడీ..." చిత్ర మళ్ళీ మొదటికి వచ్చింది.

" ఓ. అదా. చెప్పమంటావా? నాకు జ్ఞానోదయం అయింది."

"ఏంటమ్మా.ఎవరైనా బాబా? శుద్ధ గురూ?"

"చాల్లే వెటకారం." నవ్వింది నీరజ.

హమ్మయ్య అమ్మ మొహం మీద కాస్త నవ్వు. రిలీఫ్ గా అనిపించింది చిత్రకి.

" నేనేదైనా అంటే దానికి నాన్నేమంటాడో నాకు ముందే తెలిసిపోతోంది. అందుకే సగానికి సగం ఫిల్టర్ చేసుకుంటున్నా. ".

"ఓహ్. దీన్నేమంటారు బ్రహ్మజ్ఞానం లాగా, భర్త జ్ఞానమా?"

"కాదు చిత్రా. స్వయంసిద్ధ యోగా", నవ్వింది నీరజ.

"హౌ అమ్మా? ఎగ్జాంపుల్ చెప్పు?"

"ఏం చెప్తే దానికి వ్యతిరేకం కదా మీ నాన్న. అందుకని నేనే ముందు వ్యతిరేకం చెప్తాను. అప్పుడు మీ నాన్న సవ్యంలోకి వస్తాడు", పెద్ద డిస్కవరీ చేసిన పిల్లలా సంబరంగా చెప్పింది నీరజ.

"ఇది చాలా పాత కాన్సెప్ట్.వౌవ్. ఇది ఇంకా వర్కౌట్ అవుతోందా?.." అంది చిత్ర కుర్చీలో వెనక్కి వాలుకుంటూ.

" తెలిసిన వాళ్ళ పెళ్లికెళ్లాలనుకో. ఆ కార్డు డైనింగ్ టేబుల్ మీద పెడతాను. రాత్రో, పొద్దున్నో చూస్తాడు. పక్కన పెట్టేసేప్పుడు 'వాళ్లేమంత మనకి ఇంపార్టెంట్ కాదుగా' అంటాను. వెంటనే అబ్బో, బాగోదు నీరూ. ఓ అరగంట కనబడి అటెండెన్స్ చేయించుకుని వచ్చేద్దాం అంటాడు. ఇలా నా పని ఈజీ ఐపోతుంది."

" కానీ మామ్. అన్నీ అంత సింపుల్ గా అవవు కదా . అసలు డాడీకి ఎంత విసుగు, కోపం ఉండేవి? అవన్నీ ఎలా తగ్గాయి? నీతో మాట్లాడేటంత టైం ఎక్కడిది?"

"టైమా. టైం, ఎప్పుడూ తీసుకోవడాన్ని బట్టి ఉంటుంది. మేమిద్దరం మీ పిల్లలిద్దరినీ ఎంతో ప్రేమగా కని పెంచిన వాళ్ళం.ఫేమిలీ అంటే బాలెన్స్ కాదు బాలెన్సింగ్ అని అర్థమైంది. ఇన్ కమింగ్, అవుట్ గోయింగ్ కాల్స్ లిస్ట్ చూసుకుంటే చాలు , ఎవరితో టైం స్పెండ్ చేస్తున్నామో తెలిసి పోతుంది.నా అంచనా ప్రకారం, పెళ్ళైన కొత్తలో లా మేమిద్దరం మాట్లాడుకునే మోడ్ లో పడ్డామనుకుంటా. ".

చిత్ర ఆలోచనలో పడింది.

"కానీ, నేనొకటి చెప్తాను. మీ అన్న లైఫ్ చూశాక డాడీ లో చాలా మార్పొచ్చింది" అన్నది నీరజ.

చిత్ర నుంచి చూపులు తప్పించుని మెన్యూ కార్డులో డిషెస్ ఎంచుకున్నట్టు తాపీగా ఒకో పదమే ఎంచుకుంటూ, మెల్లగా అంది... " నిజానికి...నాలో...కూడా...." అంది.

"నాన్నకు ఫ్రెండ్స్ ఎక్కువ కదా మమ్మీ?"

"సరిగ్గా పాయింట్ కి వచ్చావ్. నాన్నకి ఫ్రెండ్స్ ఎక్కువ నాకు ఫ్రెండ్షిప్ ఎక్కువ."

" రియల్లీ?."

"నేను ఏ రిలేషన్ షిప్ లోనూ క్యాజువల్ గా ఉండలేను. డీప్ గా ఉంటాను.అలా మరీ లోతుగా బతకడం కొంచెం కష్టమే. ఈ మధ్య ఎనర్జీ చాలట్లేదు. అందుకే నేనే ఒక ఒడ్డుకు చేరాను. తేలిక పడ్డాను చిత్రా.".

"మమ్మీ నే చెప్పనా ? నువ్వు ఎవరు ఏం మాట్లాడినా పూర్తిగా వినవు. నీకు తోచిన పరిష్కారం చెప్పేస్తూ ఉంటావు. చాలా మంది మాట్లాడేది, వాళ్ళను వాళ్ళు ఎక్స్ ప్రెస్ చేసుకోవడానికి. నీ సలహా కోసం కాదు. నా ఒపీనియన్ లో నాన్న కి నీ దగ్గర సఫోకేటెడ్ గా ఉండేదేమో."

హాయిగా నవ్వింది నీరజ.

"ఔను.ఆ విషయం నాకు నేనే గమనించుకున్నాను . తన ఛాయిసెస్ ని గౌరవిస్తున్నా. పైగా నా ఛాయిస్ కూడా ఏంటో తెలుసుకుంటున్నా." అంది.

"గుడ్ మమ్మీ. " కుర్చీ లోంచి లేచి తన 'పోనీ'టైల్ సరి చేసుకుంటూ అడిగింది చిత్ర ," ఏంటి మమ్మీ.ఎటైనా బైటికెళ్దామా?".

" ట్రాఫిక్ అవర్స్ ఎక్కువై పోయాయ్. కాబట్టి ఇవాల్టికి మనం ఇక్కడే, కింద వాకింగ్ చేసుకుందాం. వీకెండ్ బాగుంటుందిక్కడ ఫ్లాట్స్ లో ", అంటూనే నీరజ కూడా తయారవ్వడానికి లేచింది.

---------------------

సాయంత్రమైన సూచనగా వెలుతురు తగ్గుతోంది. అప్పటిదాకా నిశ్శబ్దం గా ఉన్నది కాస్తా , ఫ్లాట్స్ లో పిల్లలందరూ ఆడుకోవడానికి కిందకి దిగడంతో అరుపులు, కేకలు, కేరింతలు, పిలుపులు, జోళ్ళ చప్పుళ్ళూ , సైకిల్ బెల్ మోతలతో హడావిడి మొదలైంది. ఓపెన్ ఏరియాలో ఓ పక్క బట్టలు, పచ్చళ్ళు పెట్టి అమ్ముతున్నారు. మరోపక్క ఫుడ్ కోర్ట్ . " మమ్మీ. ఈ ఐడియా బాగుందే. అన్ని స్నాక్స్ ఇక్కడికే వచ్చేస్తాయా? అందులోనూ, లైవ్ కిచెన్.వావ్. "

"వీకెండ్ మహిమ", అంది నీరజ.

56 ఫ్లాట్స్ ఉన్న 'శ్రీరాం బాగ్'

ఆ పూట 'అర్బన్ విలేజ్ ' అనే గ్రాఫిక్ ఫిలిం లా ఉంది. ఓ పక్క కుంపటి మీద పల్లీలు వేయిస్తూ ఠంగ్, ఠంగ్ మంటూ అట్ల పుల్ల దేగిసా మీద కొట్టే శబ్దం. మరోపక్క షార్ట్స్ , చెవి లో బ్లూటూత్ తో పరుగులు, నడకలు పెట్టే వాళ్ళ హడావుడి. కుడి వైపు 'ఫామ్ ఫ్రెష్' కూరగాయలు. ఎడం పక్క జొమాటో పార్సెల్స్ తెస్తున్న ఎర్ర బట్టల ఆర్మీ.

చిత్రా, నీరజ నడక ప్రారంభించారు.ఒక రౌండ్ తిరిగారో లేదో ఆరడుగుల దూరం నుంచే, నవ్వుతూ, "హేయ్. నీరజా" అన్నమాటతో ఎదురైందామె."

"సరళా ఆంటీ కదూ?." గొణిగింది చిత్ర. పెద్దవాళ్ళిద్దరూ మాట్లాడుకునేందుకు ఆగారు.

చిత్ర పక్కకి వెళ్లింది.అక్కడ అమ్ముతున్న హీలియం బెలూన్లు కొనుక్కుంది... ఫర్ ఓల్డ్ టైమ్స్ సేక్.బయట ఆడుకున్నాక ఇంట్లో దారం వదిలేస్తే గది చూరుకు అంటుకుని ఉండేవి.అప్పుడు ఫేన్ వెయ్యొద్దని తనూ, శీనూ కొట్టుకునేవారు.

నీరజ వచ్చాక మళ్ళీ నడక. "అమ్మా. ఆంటీ తో ఉన్నాయన ఎవరు?"

"ఇంటికెళ్లాక చెప్తా."

పైకెళ్ళి టీ పెట్టుకున్నాక వాళ్ళ మధ్య సరళ టాపిక్ రానే వచ్చింది. "సరళాంటీ డివోర్స్ తీసుకుంది చిత్రా. ఇక్కడి ఫ్లాట్ తనే కొన్నదట. ఆరేళ్ల పాప.తనను తీసుకుని కళ్యాణ్ అంకుల్ వెళ్లిపోయాడు. సరళ తన జూనియర్ కొలీగ్ ని రెండో పెళ్లి చేసుకుంది.అతనే ఆ పక్కనున్నది. "

"వెల్. చాలా ఛేంజెస్ వచ్చాయమ్మా ఇండియాలో?... ".

"ఎస్ చిత్రా. ముందెప్పుడైనా సమాజం అనే భయం తెరలు ఉండేవేమో, కానీ ఇప్పుడన్నీ బాహాటంగానే జరుగుతున్నాయి. కల్చర్ ఛేంజెస్ గురించి నేను మాట్లాడను కానీ, ఐదేళ్లకి ఇప్పటికీ స్పీడ్ పెరిగింది.ఎవరి లైఫ్ వారికి ప్రెషస్ అయింది ".

మాస్టర్ బెడ్ రూమ్ సిట్ అవుట్ లో స్మోక్ చేసి వస్తున్న శ్రీధర్, వీళ్ళ వైపు వచ్చాడు.

" యా. చిత్రా. సిగ్గు విడిచి చెప్తున్నా, సరళాంటీని చూసాక నేను చాలా మారాను".

శ్రీధర్ కూతురి ఎదుట నీరజ కూర్చున్న సోఫా వెనక్కి వెళ్ళి నిలుచున్నాడు. "ప్రతి మనిషికీ ఎమోషనల్ అండ్ ఫిజికల్ నీడ్స్ ఉంటాయి. నిజానికి రెండూ కలిపే ఉంటాయి. మా మగాళ్ళకి అదేదో కాఫీ కప్పు అందించడం, ఉతికిన డ్రెస్ రెడీగా ఉంచడంతో సహా. . ఆడవాళ్లకి కొన్ని నీడ్స్ ఉంటాయి".

వెనక నుంచి నీరజ తల మీద తన చేయి వేసి ఓసారి జుట్టు సవరించి, మెడ వెనక నుంచి భుజాలు ఒత్తుతూ,

" ఆదరణా?... పోనీ అటెన్షన్? వాటెవర్. అది కావాలి. మోహమో, దాహమో కాదు 'నేనున్నాను' అనే ఫీలింగ్ ఇచ్చే మనిషి తోడు. కలిసి టైమ్ స్పెండ్ చేయాల్సిన బాధ్యత. మన శ్రీనూ లైఫ్ లో ఏం జరిగిందో నాకు తెలీదు. అటు వాడిని, ఇటు సరళాంటీని చూసాక, మీ మమ్మీ పట్ల నా అభిప్రాయం చాలా మారింది.తను నాతో చాలా సహనంగా ఉందని అర్థమైంది.

మమ్మీ బ్రేక్ అవకుండా ఉండడానికి కారణం ఏమిటో మరి. నాకు తెలియనే తెలియదు. కానీ ఇక మీదట మా మధ్య దూరం ఉండదు. ఎందుకంటే నాకు బ్రిడ్జ్ కట్టడం వచ్చింది", ముందుకు వచ్చి, నీరజ పక్కన కూర్చున్నాడు శ్రీధర్.

" మన డిగ్నిటీ దెబ్బతినకుండా ఉండాలి తప్ప పంతాలకు పోవడం వల్ల ఒరిగేదేమీ ఉండదు. ఒకే లైఫ్ , ఒక్కొక్కరూ ఒక్కోలా చూస్తాం. ప్రపంచం మొత్తం చుట్టి వచ్చినా సేమ్ సింక్ ఎవ్వరితోనూ లైఫ్ లాంగ్ ఉండదు కదా. సో కంప్లైంట్స్ ఎందుకు? ఆర్గ్యుమెంట్ కన్న డిస్కషన్ బెటర్. సహనం మట్టికుండ.బీటువారచ్చు... ఎపుడో పగిలిపోవచ్చు కూడా . అందుకే , సంయమనం కావాలి ", అంది నీరజ శ్రీధర్ వైపు చూస్తూ.

" టేక్ ఏ బౌ . ", అన్నాడు శ్రీధర్.

చిత్ర వాళ్ళిద్దర్నీ అపురూపంగా చూస్తోంది.

ఇప్పుడు ఇంట్లో శాంతి.

సో, హోమ్ బ్యూటిఫుల్ గా ఉండొచ్చు .

నాట్ బ్యాడ్... దిస్ కపుల్, రైట్ ?... దే ఆర్ సిల్లీ అండ్ సీరియస్ కూడా. అనుకుంది.

" డిన్నర్ చేద్దామా . " అంటూ నీరజ లేచింది.

" ష్యూర్ మామ్" అంటూనే చిత్ర హీలియం బెలూన్స్ ని సిట్ అవుట్ దగ్గరికి తీసుకెళ్లి గాల్లోకి వదిలేసింది.

ట్రావెల్ లైట్.

COMMENTS